

శనివారం కామారెడ్డిలో మినీ స్టేడియం నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న మంత్రులు కేటీఆర్, వేముల, ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్, ఎంపీ బీబీ పాటిల్, కామారెడ్డి మున్సిపల్ చైర్‌పర్సన్ జాహ్నవి తదితరులు

### కామారెడ్డితో ఏండ్లనాటి బంధం

'కామారెడ్డితో ఉన్న అనుబంధం ఈనాటిది కాదు. కోనాపూర్ వచ్చినప్పుడు కూడా చెప్పిన. కేసీఆర్ తల్లిగారి ఊరు.. మా నాయినమ్మ సొంత ఊరు పోసానిపల్లి. ప్రస్తుతం బీబీపేట మండలంలో ఉంది. ఆనాడు పోసాన్‌పల్లి అందురు. అప్పర్ మానేరు కట్టిన టైంలో భూములు మునిగిపోతే అక్కడ్నుంచి సిద్దిపేటలోని చింతమడకలో స్థిరపడ్డారు' అని మంత్రి కేటీఆర్ కామారెడ్డితో తమ కుటుంబానికి ఉన్న ఏండ్లనాటి అనుబంధాన్ని గుర్తుచేసుకున్నారు. నిజానికి ఆ రోజు గ్రామానికి వచ్చినప్పుడు రాజకీయ పరమైన ఆలోచన లేదని, గంప గోవర్ధన్ వచ్చి కేసీఆర్‌ను పోటీ చేయాలని అడుగుతారని అనుకోలేదని అన్నారు. గంప గోవర్ధన్ ముందుకు వచ్చి స్వయంగా కేసీఆర్‌కు విజ్ఞప్తి చేశారని చెప్పారు. పదవుల కోసం వెంపర్లాడే నాయకులు చాలా మందిని చూశాం కానీ.. తన ప్రాంతం కోసం, ప్రజల మేలు కోసం కేసీఆర్‌ను ఇక్కడకు పిలిపించుకోవడం గొప్ప విషయం అని ప్రశంసించారు. సీఎంను ఆహ్వానించినందుకు గంప గోవర్ధన్‌ను అభినందిస్తున్నా అని చెప్పారు.

# బీజేపీది మేకప్.. కాంగ్రెస్‌ది ప్యాకప్!

## ఓటుకునోటు దొంగ చేతిలో కాంగ్రెస్ • కిషన్‌రెడ్డి, రేవంత్ మధ్య చీకటిబంధం • రేవంత్‌రెడ్డి కాదు.. 'రేటెంత'రెడ్డి: కేటీఆర్

- **ఢిల్లీ పార్టీలు తెలంగాణలో అవసరమా?**
- **రికార్డు కొడదాం.. చరిత్ర సృష్టిద్దాం**
- **దక్షిణ భారతదేశంలోనే తొలి హ్యాట్రిక్ సీఎంగా కేసీఆర్‌ను గెలిపించుకుందాం**
- **సరికొత్త చరిత్రకు వేదిక కానున్న కామారెడ్డి**
- **కామారెడ్డిలో బీఆర్‌ఎస్ కార్యకర్తల సమావేశంలో వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్**

నిజామాబాద్, అక్టోబర్ 7 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): బీజేపీది మేకప్.. కాంగ్రెస్‌ది ప్యాకప్ అని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, రాష్ట్ర ఐటీ, పురపాలక శాఖ మంత్రి కేటీఆర్ తనదైన శైలిలో సెటైర్లు వేశారు. సీఎం కేసీఆర్ కామారెడ్డిలో పోటీచేస్తుండటంతో ప్రతిపక్షాల గుండెల్లో రైళ్లు పరుగెడుతున్నాయని అన్నారు. సరికొత్త చరిత్రకు కామారెడ్డి వేదిక కాబోతున్నదని, దక్షిణ భారతదేశంలోనే హ్యాట్రిక్ సీఎంగా కేసీఆర్ రికార్డు సృష్టించబోతున్నారని ధీమా వ్యక్తంచేశారు. దేశంలో మరెక్కడా లేనివిధంగా కేసీఆర్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించుకోవాల్సిన బాధ్యత కామారెడ్డి ప్రజలందరిపై ఉన్నదని చెప్పారు. కామారెడ్డి ఆదర్శ నియోజకవర్గంగా, ఓ రోల్‌మాడల్‌గా నిలువడం ఖాయమని పేర్కొన్నారు. కామారెడ్డి పర్యటనలో భాగంగా డిగ్రీ కళాశాల మైదానంలో శనివారం నిర్వహించిన బీఆర్‌ఎస్ కార్యకర్తల సమావేశంలో కేటీఆర్ ప్రసంగించారు. అంతకుముందు మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి, ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు ముజీబుద్దీన్‌తో కలిసి 8 కోట్లతో నిర్మించనున్న మినీ స్టేడియానికి శంకుస్థాపన చేశారు. కార్యకర్తలను ఉద్దేశించి గంటకుపైగా ప్రసంగించిన కేటీఆర్.. వచ్చే ఎన్నికల్లో బీఆర్‌ఎస్ అద్భుత విజయాన్ని సాధించబోతున్నదని ధీమా వ్యక్తంచేశారు. అతి విశ్వాసానికి పోకుండా కార్యకర్తలంతా మరింత కష్టపడాలని సూచించారు. కాంగ్రెస్, బీజేపీలకు డిపాజిట్లు గల్లంతు కావాలని అన్నారు. కామారెడ్డి ప్రాంతంతో కేసీఆర్‌కు ఉన్న అనుబంధాన్ని వివరించారు. 2004లో పొత్తులో భాగంగా కాంగ్రెస్ నుంచి పోటీ చేసిన షబ్బీర్‌అలీ గెలుపునకు మిత్ర ధర్మంలో భాగంగా ప్రచారం చేసేందుకు కేసీఆర్‌ను బతిమిలాడారని గుర్తుచేశారు. 2001 నుంచి గులాబీ కంచుకోటగా ఉన్న కామారెడ్డిని పొత్తు ధర్మంలో భాగంగా కేసీఆర్ వదులుకొన్నారని, అలాంటి షబ్బీర్‌అలీ ఇప్పుడు నోటికొచ్చినట్టు మాట్లాడుతున్నారని మండిపడ్డారు.

**కామారెడ్డి రికార్డు సృష్టించాలి**

119 నియోజకవర్గాల్లో, దేశంలోనే రికార్డు సృష్టించేందుకు కామారెడ్డి ముందుకు రావాలని మంత్రి కేటీఆర్ పిలుపునిచ్చారు. ప్రతీ గ్రామంలో మ్యానిఫెస్టో తయారు చేయాలని, ఏంకావాలో తనను అడగాలని, ఆ బాధ్యత తాను తీసుకుంటానని మాటిచ్చారు. 'గంభీరావుపేటలో ప్రోగ్రామ్ చేసుకుని వస్తుంటే మాచారెడ్డిలో ఆగిన. ఛాయ్ తాగుతుంటే పిల్లల్ని అడిగిన. సీఎం వస్తుండు కదా.. ఏమనుకుంటున్నారని అడిగినా. మాకు సీఎం వస్తుండు కదా.. మాకేం రంది లేదన్నరు. ఇలాంటి చర్చ అంతటా జరుగుతున్నది. రాష్ట్రంలోనే కామారెడ్డి అగ్రశ్రేణి నియోజకవర్గం అవుతుంది' అని పేర్కొన్నారు. ఈసారి ఇంట గెలువడంతోపాటు బయటకూడా గెలువాల్సి ఉన్నదని చెప్పారు. మహారాష్ట్రలో ఒక్క ఓటుతో నాలుగైదు ప్రభుత్వాలు మారాయని, దమ్మున్న నాయకుడి కోసం మహారాష్ట్ర ఎదురు చూస్తున్నదని తెలిపారు.

**ప్రతిపక్షాల మైండ్ బ్లాక్ అవ్వాలి!**

'పెద్దా చిన్నా చూడకండి. ఒక్కో బూత్‌లో లెక్కబెట్టి కొట్టాలి. 266 బూత్‌లుంటే 266 మంది బ్రిగేడియర్లను ఇయ్యండి. నేనే ఫాలోఅప్ చేస్తా. రోజూ ఫోన్ చేస్తా. కొడితే ప్రతిపక్షాల దిమ్మ తిరిగి మైండ్ బ్లాంక్ అయ్యేలా కొట్టాలి. ఎప్పుడొచ్చామన్నది కాదు. బుల్లెట్ దిగిందా.. అన్నట్టు మెజార్టీ రికార్డు కొట్టాలి' అని మంత్రి కేటీఆర్ పిలుపునిచ్చారు. అధినాయకుడే వస్తున్నందున అంతా కలిసి కలిసి పనిచేయాలని సూచించారు. ఈ ఎన్నికల్లో సోషల్ మీడియా కూడా చాలా ముఖ్యమైనదని, గ్రామంలో కో-ఆర్డినేటర్లను నియమించాలని ఆదేశించారు. గంప గోవర్ధన్ ఇప్పటికే మెడికల్ కాలేజీ తెచ్చుకున్నరని, ఇప్పుడు ఇంజినీరింగ్ కళాశాలకు సూటి పెట్టారని అన్నారు. సీఎం తలుచుకుంటే అన్నీ సాధ్యమైతాయని చెప్పారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు చెందిన 146 ఎకరాలకు కాంపౌండ్‌వాల్, మినీ ట్యాంక్‌బండ్ పూర్తి, పబ్లిక్ గార్డెన్ అభివృద్ధి, డెయిరీ కళాశాలలో కృషి విజ్ఞాన్ కేంద్రం ఏర్పాటు, రైతు ఉత్పత్తులకు మార్కెటింగ్ వసతులు, క్రీడా ప్రాంగణాలు, చెక్‌డ్యామ్‌ల నిర్మాణం, పుణ్యక్షేత్రాలు అభివృద్ధి చేయాలని గంప గోవర్ధన్ కోరారని, ఇవన్నీ పూర్తి చేసేందుకు ప్రయత్నిస్తామని మాట ఇచ్చారు. మంత్రులుగా ఉండి కూడా చేయలేని పనులు ఎమ్మెల్యేగా గంప గోవర్ధన్ చేసి చూపించారని చెప్పారు. సీఎంను కలిసి నిన్న కాక మొన్న 35 కోట్ల స్పెషల్ డెవలప్‌మెంట్ ఫండ్ తెచ్చారని అన్నారు. 'ఇప్పుడే 8 కోట్లతో ఇండోర్ స్పోర్ట్స్ స్టేడియానికి శంకుస్థాపన చేసుకున్నామని, అన్ని వసతులతో 20 ఎకరాల్లో ఆటోనగర్ నిర్మాణం జరుగుతున్నదని చెప్పారు.

**రేవంత్‌తో పోటీపడటం దురదృష్టకరం**

చావునోట్లో తలపెట్టి తెలంగాణ తెచ్చిన కేసీఆర్.. రేవంత్‌లాంటి ఓటుకు నోటు దొంగతో తలపడాల్సి రావడం దురదృష్టకరమని కేటీఆర్ అన్నారు. ఓవైపు ఓటుకు నోటు దొంగ, మరోవైపు తెలంగాణ ఉద్యమంలో రాజీనామా డ్రామాలాడిన కిషన్‌రెడ్డితో పోటీ అవమానకరంగా ఉన్నదని చెప్పారు. వీరిద్దరూ తెలంగాణ ఉద్యమంలో తీరని అన్యాయం చేశారని, ఇలాంటివాళ్లతో మనకు పోటీయా? అని ప్రశ్నించారు. వాళ్లకు ఒక్క ఓటు పడ్డా తలవంచుకోవాల్సిన పరిస్థితి అని వ్యాఖ్యానించారు. ఆ రోజు ఓటుకు నోటు.. నేడు సీటుకు నోటుతో రేవంత్ దిగజారిపోయాడని, ఇప్పుడు ఆయనను అందరూ రేవంత్‌రెడ్డి అని పిలువడం లేదని.. 'రేటెంత'రెడ్డి అని పిలుస్తున్నారని చురకలంటించారు. రేవంత్‌రెడ్డి ఒరిజినల్‌గా ఆర్‌ఎస్‌ఎస్ మనిషని, కార్వాన్‌లో కిషన్‌రెడ్డికి పోలింగ్ ఏజెంట్‌గా పని చేసిన వ్యక్తి అని.. వారిద్దరి మధ్య చీకటి సంబంధం కొనసాగుతున్నదని తెలిపారు. గాంధీభవన్‌లో ఈ గాడ్సేను కూర్చోబెట్టింది ఆర్‌ఎస్‌ఎస్ వాళ్లేనని తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. కాంగ్రెస్, బీజేపీలకు బీ టీమ్ కావాల్సిన గత్యంతరం బీఆర్‌ఎస్‌కు పట్టలేదని, తాము తెలంగాణ ప్రజలకే ఏ టీం అని స్పష్టంచేశారు. కేంద్రంలో బీఆర్‌ఎస్ పాత్ర లేకుండా ప్రభుత్వం ఏర్పడే పరిస్థితి ఉండబోదని స్పష్టం చేశారు. మహారాష్ట్రకు కేసీఆర్ పోతుంటే కాంగ్రెస్, బీజేపీలకు మనసున పడుతలేదన్నారు.

**గంప గోవర్ధన్‌ను స్ఫూర్తిగా తీసుకోవాలి**

'మనమందరం కాంగ్రెస్‌కు ఇంకొక్క చాన్స్ ఇయ్యాలట. ఏక్ మోఖా దేవో అంటున్నారు. వీళ్లకు 11 సార్లు అవకాశం ఇచ్చినం కదా. వీళ్లే కదా అధికారం వెలుగబెట్టినోళ్లు. సాగు, తాగునీరు ఇయ్యక, కరెంట్ ఇయ్యలేక ఆరు దశాబ్దాలు చావకొట్టినోళ్లకు మళ్లీ అవకాశం ఇస్తారా?' ఆలోచించుకోవాలని కోరారు. 'కామారెడ్డినుంచి కేసీఆరే పోటీ చేస్తే మీరేం చేస్తారని నేను గంప గోవర్ధన్‌ను అడిగా. కార్యకర్తగా పని చేస్తా అని సమాధానమిచ్చారు. అందరూ గోవర్ధన్‌ను స్ఫూర్తిగా తీసుకుని పనిచేయాలి' అని పిలుపునిచ్చా రు. అంతకుముందు 2వ వార్డు బీజేపీ కౌన్సిలర్ రవి కేటీఆర్ సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. గ్రంథాలయ సంస్థ చైర్మన్ అయాచితం శ్రీధర్, ఫుడ్ కమిషన్ మాజీ చైర్మన్ తిరుమల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



శనివారం కామారెడ్డిలో నిర్వహించిన బీఆర్‌ఎస్ కార్యకర్తల సభకు భారీగా తరలివచ్చిన బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు

### 2004 నుంచీ కామారెడ్డి బీఆర్‌ఎస్‌దే

**2001లో** జలదృశ్యంలో పార్టీ ఆవిర్భవించిన నాడు కామారెడ్డి, ఎల్లారెడ్డిలో భావజాల వ్యాప్తి జరిగిందని మంత్రి కేటీఆర్ తెలిపారు. ఫలితంగా 2001లో వచ్చిన మొదటి జిల్లా పరిషత్తు ఎన్నికల్లో ఆనాటి నిజామాబాద్ జిల్లాలోని కామారెడ్డి, ఎల్లారెడ్డి నియోజకవర్గాల్లో మాత్రమే నేరుగా గులాబీ జెండా ఎగిరిందని గుర్తుచేశారు. మాచారెడ్డి మండలంలో ఎంపీపీ, జడ్పీటీసీ రెండూ ఏకగ్రీవమయ్యాయని తెలిపారు. 13 ఎంపీటీసీల ఏకగ్రీవంతో మాచారెడ్డి సత్తా చాటిందని పేర్కొన్నారు. అందుకే సీఎం కేసీఆర్ జల సాధన ఉద్యమాన్ని ప్రారంభించేందుకు ఇక్కడికి బ్రిగేడియర్‌గా వచ్చారని గుర్తుచేశారు. రాష్ట్రంలో గోదావరి, కృష్ణ నదుల్లో జరుగుతున్న పోరాటంలో కామారెడ్డి కీలకంగా మారిందని, పార్టీ నిధుల సేకరణకు కూలీ పనుల కోసం పార్టీ అధ్యక్షుడిగా కేసీఆర్ ఇక్కడికే వచ్చారని తెలిపారు. ఈ నియోజకవర్గంతో ఉన్న అనుబంధాన్ని, ప్రేమను పంచుకున్నారు.

> నాలుగు కోట్ల జనాల నుదిటిపై నిత్య తిలకం కేసీఆర్. భూమి పుత్రుడు కేసీఆర్. కామారెడ్డి నుంచి పోటీ చేయాలని గంప గోవర్ధన్ కోరడం, కేసీఆర్ అంగీకరించడం వెనుక బలమైన కారణం ఉంది. నెర్రెలు బారిన నేల.. నెత్తురు పారిన నేలను పచ్చబడేలా చేయాలని, నీళ్లు పారియ్యాలనే ఆలోచన ఉన్నది.
>
> -మంత్రి కేటీఆర్

> 'ముదిరాజ్‌లకు 2 ఎకరాల స్థలం, 2 కోట్లు ఇయ్యాలన్నారు. ఈ రోజే ఉత్తర్వులిస్తాం. ముదిరాజ్‌లకు మాటిస్తా ఉన్నా. ప్రాతినిధ్యం విషయంలో గ్యాప్ ఉంటే సవరించుకుంటాం. బండ్ల ప్రకాశ్ డిప్యూటీ చైర్మన్‌గా శాసనమండలిలో ఉన్నారు. రానున్న కాలంలో సగౌరవంగా కడుపులో పెట్టుకుని, గుండెల్లో పెట్టుకుని చూసుకుంటాం.
>
> -మంత్రి కేటీఆర్


> మనం తెలంగాణ బిడ్డలం. రేషం, పౌరుషంగల్ల బిడ్డలం. ఏ నిర్ణయమైనా తెలంగాణ గల్లీలో జరగాల్సిందే. కానీ బీజేపీ, కాంగ్రెస్ పార్టీల్లో నిర్ణయాలు ఢిల్లీలో జరుగుతాయి. బీఫాం ఢిల్లీలో, స్కీంలకు అనుమతి ఢిల్లీలో, బాత్‌రూం పోవాలన్నా ఢిల్లీలోనే అనుమతి తీసుకోవాలి. ఢిల్లీలో మోకరిల్లే సన్నాసులు, మాట్లాడితే ఢిల్లీకి పోవాల్సిన దౌర్భాగ్యులు మనకు అవసరమా?
>
> -మంత్రి కేటీఆర్

### కేసీఆర్‌కు అఖండ మెజార్టీ ఇవ్వాలి

పౌరుషానికి ప్రతీకగా ఉన్న నేలకు కేసీఆర్ వస్తున్నందుకు సంతోషిస్తున్నాను. ఈ అవకాశం దక్కడం కామారెడ్డి నియోజకవర్గ ప్రజల అదృష్టం. కుల, మతాలకు అతీతంగా కేసీఆర్‌కు అఖండ మెజార్టీ కట్టబెట్టాలి. కామారెడ్డి నుంచి పోటీ అని కేసీఆర్ ప్రకటించిన మరుక్షణమే గెలుపు ఖాయమైంది. తేలాల్సింది మెజార్టీ మాత్రమే. సీఎం కేసీఆర్ పోటీచేస్తుండటంతో దేశం మొత్తం కామారెడ్డి వైపే చూస్తున్నది. గంప గోవర్ధన్‌కు రెండు విషయాలు విజ్ఞప్తి చేస్తున్నాను. కామారెడ్డిలో 2 లక్షల 48 వేల ఓట్లు, 266 పోలింగ్ బూత్‌లు ఉన్నాయి. ప్రజలు మనవైపే ఉన్నారు. మంచి మెజార్టీతో కేసీఆర్‌ను శాసనసభకు పంపాలి.

-మంత్రి కేటీఆర్

### లోకం పోకడ




## అనుకోకుండా జరిగింది.. మన్నించండి

### హోం మంత్రి మహమూద్ అలీ



హైదరాబాద్, అక్టోబర్ 7 (నమస్తే తెలంగాణ): మంత్రి తలసాని పుట్టినరోజు సందర్భంగా జరిగిన ఘటనపై హోం మంత్రి మహమూద్ అలీ స్పందించారు. 'గన్‌మెన్ చెంపదెబ్బ వివాదం'పై ఆయన.. అది అనుకోకుండా జరిగిన పరిణామమని, దానికి తాను తీవ్రంగా చింతిస్తున్నానని, క్షమాపణ కోరారు. తనకు రక్షణగా ఉన్నవారిని సొంతబిడ్డల్లా చూసుకుంటున్నానని తెలిపారు. చెంపదెబ్బ ఘటనపై హోం మంత్రి వివరణ ఇవ్వడంతో వివాదం సద్దుమణిగింది.

### వర్షకాలం

| | గరిష్ఠం | కనిష్ఠం |
|---|---|---|
| ఆదిలాబాద్ | 37.0°c | 21.2°c |
| ఖమ్మం | 36.0°c | 23.0°c |
| వరంగల్ | 36.0°c | 21.0°c |
| రంగారెడ్డి | 35.4°c | 17.3°c |
| నల్లగొండ | 35.0°c | 24.2°c |
| నిజామాబాద్ | 34.3°c | 22.3°c |
| కరీంనగర్ | 34.0°c | 23.0°c |
| మెదక్ | 33.7°c | 18.7°c |
| హైదరాబాద్ | 33.6°c | 20.5°c |
| మహబూబ్‌నగర్ | 32.6°c | 22.6°c |

### నిపుణ — విద్య, ఉద్యోగ సమాచారం

#### పీహెచ్‌డీ ప్రవేశాలు

**బెంగళూరులోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెంటల్ హెల్త్ అండ్ న్యూరో సైన్సెస్‌లో కింది కోర్సుల్లో ప్రవేశాల కోసం ప్రకటన విడుదలైంది.**

- కోర్సు: పీహెచ్‌డీ
- సబ్జెక్టులు: బయోఫిజిక్స్, బయోస్టాటిస్టిక్స్, మెంటల్ హెల్త్ ఎడ్యుకేషన్, నర్సింగ్, సైక్రియాట్రి, ఇంటిగ్రేటివ్ మెడిసిన్ తదితరాలు
- దరఖాస్తు, చివరితేదీ తదితరాల కోసం వెబ్‌సైట్ చూడవచ్చు
- వెబ్‌సైట్: https://nimhans.ac.in

#### అసిస్టెంట్ ప్రొఫెసర్లు

**సెంట్రల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైక్రియాట్రిలో కింది ఖాళీల భర్తీకి ప్రకటన విడుదలైంది.**

- మొత్తం ఖాళీలు: 14
- పోస్టులు: అసిస్టెంట్ ప్రొఫెసర్
- విభాగాలు: అనెస్థీషియాలజీ, న్యూరాలజీ, న్యూరోసర్జరీ, రేడియో-డయాగ్నసిస్
- దరఖాస్తు: వెబ్‌సైట్‌లో
- చివరితేదీ: అక్టోబర్ 28
- వెబ్‌సైట్: www.cipranchi.nic.in

#### సూపర్‌వైజర్లు

**పవర్‌గ్రిడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్‌లో నిర్ణీత కాలపరిమితిలో కింది పోస్టుల భర్తీకి ప్రకటన విడుదలైంది.**

- మొత్తం ఖాళీలు: 20
- పోస్టులు: ఫీల్డ్ సూపర్‌వైజర్
- విభాగాలు: ఎలక్ట్రికల్, సివిల్
- దరఖాస్తు: ఆన్‌లైన్‌లో
- చివరితేదీ: అక్టోబర్ 16
- వెబ్‌సైట్: http://www.powergrid.in

#### ఆన్‌లైన్‌లో స్టడీ మెటీరియల్

పోటీ పరీక్షల ప్రత్యేకం

- గ్రూప్స్ ప్రత్యేకం హిస్టరీ, కరెంట్ అఫైర్స్, జీఎస్ కోసం పైన క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి.

## పెట్టుబడి షెహర్

› మొదటిపేజీ తరువాయి...

సెమీ కండక్టర్ల తయారీ పరిశ్రమ ఏర్పాటునకు కేన్స్ టెక్నాలజీ భారీ పెట్టుబడితో ముందుకొచ్చింది. ఫాక్స్‌కాన్ వచ్చినప్పుడే అనేక అనుబంధ సంస్థలు కూడా హైదరాబాద్‌కు క్యూ కడతాయని వాణిజ్యరంగ ప్రముఖులు పేర్కొన్నారు. ఆ వాదన కేన్స్ రాకతో నిజమయ్యింది. ఇప్పటికే రంగారెడ్డి జిల్లా మహేశ్వరం ప్రాంతంలో ఫ్యాబ్‌సిటీ, ఎలక్ట్రానిక్స్ సిటీ ఏర్పాటు ద్వారా అనేక ఎలక్ట్రానిక్ కంపెనీలు పెట్టుబడులు పెట్టాయి. విమానయాన రంగ దిగ్గజం బోయింగ్‌తో కలిసి టాటా సంస్థ రంగారెడ్డి జిల్లాలో హెలికాప్టర్ల బాడీలను తయారు చేస్తున్నది. ప్రభుత్వ పాలసీలు, అత్యాధునిక మౌలిక సదుపాయాలతో కూడిన ఇండస్ట్రియల్ పార్కులు, నిరంతర విద్యుత్తు, నీటి సరఫరా, అంతర్జాతీయ విమానాశ్రయం, లగ్జరీ హోటళ్లు దేశంలోని ఏ ప్రాంతానికైనా రెండు గంటల్లో చేరుకునే అవకాశం తదితర అంశాలు హైదరాబాద్‌ను పెట్టుబడుల గమ్యస్థానంగా అగ్రస్థానంలో నిలబెట్టాయి.

**బెంగళూరుపై సడలుతున్న ఆశలు**

కర్ణాటకలో ముఖ్యంగా బెంగళూరులో అదుపుతప్పిన ట్రాఫిక్ సమస్యకుతోడు నాసిరకం మౌలిక సదుపాయాల వల్ల కొత్తగా పెట్టుబడులు వస్తాయనుకోవడం మూర్ఖత్వమే అవుతుందని పలువురు పారిశ్రామికవేత్తలు అంటున్నారు. కేన్స్ టెక్నాలజీ హైదరాబాద్‌కు రావడంపట్ల కిరణ్ మజుందార్ షా, మోహన్‌దాస్ పై వంటి పారిశ్రామికవేత్తలు స్పందించారు. సిలికాన్ వ్యాలీగా చెప్పుకొనే బెంగళూరులో ట్రాఫిక్, మౌలిక సదుపాయాల సమస్యవల్ల కొత్త పెట్టుబడులు వచ్చే అవకాశం లేదని ఎక్స్‌లో ధ్వజమెత్తారు. బెంగళూరు పరిస్థితిపై సీఎం, మాజీ సీఎం, డిప్యూటీ సీఎంసహా అక్కడి ప్రముఖులను నిలదీశారు.

**ట్రాఫిక్ సమస్యకు చెక్ పెట్టిన తెలంగాణ**

తెలంగాణ ఏర్పాటుకు పూర్వం హైదరాబాద్‌లో ట్రాఫిక్ సమస్య ఏ స్థాయిలో ఉండేదో ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు. అందుకే రాష్ట్ర ఏర్పాటు తరువాత హైదరాబాద్‌కు చెందిన ఉన్నతాధికారులతో సీఎం కేసీఆర్ నిర్వహించిన మొదటి సమావేశంలోనే ఈ అంశంపై ప్రధానంగా దృష్టి కేంద్రీకరించి ట్రాఫిక్ సమస్యను సమూలంగా పరిష్కరించాలని అధికారులకు స్పష్టంచేశారు. ఏకంగా రూ.25,000 కోట్లతో స్ట్రాటజిక్ రోడ్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాంకు శ్రీకారం చుట్టారు. మొదటిదశలో 30 కిపైగా ఫ్లైఓవర్లు, అండర్‌పాస్‌ల నిర్మాణాన్ని పూర్తిచేశారు. ప్రస్తుతం రెండో దశ పనులు కొనసాగుతున్నాయి.

**బెంగళూరులో అదుపుతప్పిన ట్రాఫిక్**

బెంగళూరులో ఇస్రో లేఔట్ ప్రాంతం నుంచి కోరమంగళ అనే ప్రాంతం మధ్య దూరం 12 కిలోమీటర్లు. ఈ ప్రయాణానికి కనీసం 3 గంటల సమయం పడుతున్నదంటే పరిస్థితి ఎంత అధ్వాన్నంగా ఉన్నదో ఊహించుకోవచ్చు. సమయానికి గమ్యం చేరుకోలేక అనేకమంది తమ వ్యాపార అగ్రిమెంట్లు, ఉద్యోగాలు కోల్పోతున్నారు. పది కిలోమీటర్ల ప్రయాణానికి 150 నుంచి 200 నిముషాలు పడుతుండటంతో ర్యాపిడో, ఓలా వంటి క్యాబ్‌లకు రూ.వందల్లో వెయిటింగ్ చార్జీలు చెల్లించాల్సి వస్తున్నదని ప్రజలు వాపోతున్నారు.

## తెలంగాణ సంస్కృతి గొప్పది

- **భారత పర్యటనకు వెళ్లినప్పుడు అక్కడికి వెళ్లే ప్రయత్నం చేస్తా**
- **న్యూజిలాండ్ ప్రధాని క్రిస్ హిప్కిన్స్**
- **అక్లాండ్‌లో రాష్ట్ర దశాబ్ది సంబురం**
- **క్రిస్‌కు రాజన్న సిరిపట్టు శాలువా**

హైదరాబాద్, అక్టోబర్ 7 (నమస్తే తెలంగాణ): తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలు గొప్పవని న్యూజిలాండ్ ప్రధాని క్రిస్ హిప్కిన్స్ పేర్కొన్నారు. న్యూజిలాండ్ పురోగతిలో భాగస్వామ్యం అవుతున్న తెలంగాణకు చెందిన ఎన్నారైలను ఆయన అభినందించారు. న్యూజిలాండ్ తెలంగాణ సెంట్రల్ అసోసియేషన్ (ఎన్‌జడ్‌టీసీఏ) ఆధ్వర్యంలో బతుకమ్మ, దసరా, దీపావళి ఉత్సవాలతోపాటు తెలంగాణ దశాబ్ది సంబురాలను ఘనంగా నిర్వహించారు. అక్లాండ్‌లో జరిగిన ఈ వేడుకలకు న్యూజిలాండ్ ప్రధాని క్రిస్ హిప్కిన్స్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొన్నారు. తెలంగాణ ఎన్నారైలతో కలిసి బతుకమ్మ ఆడారు. వండర్ గర్ల్స్ సంస్కృతి గ్రూప్, అనురాధ స్కూల్ ఆఫ్ డ్యాన్స్ బృందంతో కలిసి ఆడిపాడారు. తెలంగాణ జానపద, బాలీవుడ్ సినీపాటలతో ఉత్సవాలు హోరెత్తాయి. ఈ సందర్భంగా హిప్కిన్స్ మాట్లాడుతూ న్యూజిలాండ్‌లో నివసిస్తున్న తెలంగాణ ఎన్నారైల తల్లిదండ్రుల కోసం దీర్ఘకాలిక వీసా పాలసీని రూపొందిస్తామని చెప్పారు. తాను భారత్‌లో పర్యటించే సందర్భం వస్తే తప్పకుండా తెలంగాణకు వెళ్తానని వెల్లడించారు. న్యూజిలాండ్ కమ్యూనిటీ మినిస్టర్ ప్రియాంక రాధాకృష్ణన్ తెలంగాణ సమాజంతో తనకున్న అనుబంధాన్ని నెమరేసుకొన్నారు. ఈ సందర్భంగా ప్రధాని క్రిస్‌తోపాటు మంత్రి ప్రియాంకకు ఎన్‌జడ్‌టీసీఏ వ్యవస్థాపకుడు కల్యాణ్‌రావు కాసుగంటి రాజన్న సిరిపట్టు శాలువాను బహూకరించారు. తెలంగాణ కళాకారులను ప్రోత్సహించేందుకు కృషి చేస్తున్న నీతా విజయ్‌కి 'ప్రైడ్ ఆఫ్ తెలంగాణ ఇన్‌స్పైర్' అవార్డును అందజేశారు. ఐశ్వర్య కోకా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆద్యంతం అలరించాయి. ఈ కార్యక్రమంలో రామ్మోహన్ దంతాలసహా న్యూజిలాండ్‌లో ఉన్న తెలంగాణ ఎన్నారైలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



న్యూజిలాండ్‌లో నిర్వహించిన బతుకమ్మ సంబరాల్లో ప్రధాని క్రిస్ హిప్కిన్స్ తదితరులు